తల్లీబిడ్డలకు పోషకాహారమే రక్ష

- అంగన్‌వాడీ కేంద్రాల్లో సరఫరా
- పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తూ మాసోత్సవాలు
- గర్భిణులు, బాలింతల్లో రక్తహీనతకు చెక్ పెట్టే ప్రయత్నం

మద్రిపాలెం : గర్భిణులు, తల్లీబిడ్డల ఆరోగ్య సంరక్షణ కోసం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందిస్తున్నారు. అయినప్పటికీ క్షేత్రస్థాయిలో రక్తహీనత, బరువు లోపాలు బయటపడుతుండడంతో వాటికి చెక్‌పెట్టి పోషకాహారంపై అవగాహన కల్పించేందుకు మహిళా శిశు సంక్షేమ శాఖ ఏటా సెప్టెంబర్ నెలలో పోషణ మాసోత్సవాలు నిర్వహిస్తోంది. మద్రిపాలెం ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్ట్ పరిధిలో తొమ్మిది సెక్టార్లు ఉండగా వాటిలో 273 అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తున్నారు. అన్ని కేంద్రాల్లోనూ గర్భిణులు, బాలింతలు, 3 నుంచి 6 ఏళ్ల వయసు గల పిల్లలకు బాల సంజీవని పథకం ద్వారా ఒక పూట భోజనం, రోజూ ఉడికించిన గుడ్డు, చిన్నారులకు 100 మి.లీ పాలు, గర్భిణులు, బాలింతలకు 200 మి.లీ పాలు, నెలకి 25 గుడ్లు అందజేస్తున్నారు. అలాగే 7 నెలల నుంచి 3 సంవత్సరాల వయసు గల పిల్లలకు రెండున్నర కిలోల బాలామృతం, 25 గుడ్లు, రెండున్న లీటర్ల పాలు కేంద్రాల ద్వారా అందిస్తున్నారు. అర్బన్ ప్రాజెక్ట్ కేంద్రాల్లో 3700 మంది బాలింతలు, 4,542 మంది గర్భిణులు, 42,443 మంది చిన్నారులు ఉన్నారు. వీరంతా అంగన్‌వాడీ కేంద్రాల నుంచి పౌష్టికాహారం పొందుతున్నారు. మురికివాడల్లో నివసించే వారిలో నిరక్షరాస్యులు ఎక్కువగా ఉండడంతో ఎలాంటి పోషకాహారం తీసుకోవాలో తెలియని పరిస్థితి. దీంతో సెప్టెంబర్ నెలంతా గర్భిణులు, బాలింతలు, పిల్లలు ఎలాంటి ఆహారం తీసుకోవాలి, పోషకాహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలపై అంగన్‌వాడీ కేంద్రాలతోపాటు పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఫోర్టిఫైడ్ బియ్యం, ఆకుకూరలపై...

ప్రభుత్వ నిర్ణయం మేరకు ఫోర్టిఫైడ్ బియ్యం, ఆకుకూరలు ఆహారంగా తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలపై అంగన్‌వాడీ టీచర్లు విస్తృత ప్రచారం చేస్తూ అందరికీ అవగాహన కల్పిస్తున్నారు. ఈ బలవర్ధకమైన బియ్యంలో విటమిన్స్ అధికంగా ఉంటాయని, విటమిన్ బి – 12, ఫోలిక్ యాసిడ్, తదితర విటమిన్స్ పుష్కలంగా వుంటాయని వివరిస్తున్నారు.

ఆకుకూరలతో కూడిన పప్పులు వండి కేంద్రంలో చిన్నారులకు అందజేస్తున్నారు. బాలింతలు, గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల మానసిక, శారీరక ఆరోగ్యంతోపాటు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని వివరిస్తున్నారు. బియ్యం, గోధుమలు, జొన్నలు, సజ్జలు, పెసర, నువ్వులు, వేరుసెనగ తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను లబ్ధిదారులకు వివరిస్తున్నారు.



గాంధీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో భోజనాలు చేస్తున్న చిన్నారులు



నరేంద్రనగర్ కేంద్రంలో ఆహారం తింటున్న చిన్నారులు

పూర్తి సహకారం అందిస్తున్నారు



నేను గర్భం దాల్చినప్పటి నుంచి అంగన్‌వాడీ కేంద్రం ద్వారా పౌష్టికాహార కిట్లను అందిస్తున్నారు. తరచూ ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే తీసుకోవాల్సిన జాగ్రత్తలను చెబుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రం నుంచి పూర్తి స్థాయిలో సహకారం లభిస్తోంది.

– పి.శ్యామల, గ్రీన్ గార్డెన్స్

అవగాహన కల్పిస్తున్నాం



గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పౌష్టికాహారం తీసుకునేలా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా తరచూ అవగాహన కల్పిస్తున్నాం. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవాలను పురస్కరించుకుని ఇంటింటికీ నెల రోజులపాటు వెళ్లి అవగాహన కల్పిస్తున్నాం. పోషకాహారం, తాగునీరు, పచ్చదనం, పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం.

– ఎం.వి.రమణకుమారి, సీడీపీవో, ఐసీడీఎస్ మద్రిపాలెం

తీసుకోవాల్సిన ఆహారంపై వివరిస్తున్నాం



పోషణ మాసోత్సవాల్లో భాగంగా గర్భిణులు, బాలింతలు, పిల్లలు ఎలాంటి ఆహారం తీసుకోవాలో స్టాల్స్ ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నాం. ఫ్లెక్సీలు ప్రదర్శిస్తూ ఇంటింటికీ వెళ్లి తల్లిపాల విశిష్టతను వివరిస్తున్నాం. కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందిస్తూ అవగాహన కల్పిస్తున్నాం.

– మౌలా బీబీ, అంగన్‌వాడీ టీచర్, గాంధీనగర్

2న రోటరీ మెగా బ్యాడ్మింటన్ టోర్నమెంట్



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ ఎండీ యాసిన్, తదితరులు

సీతంపేట : అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా రోటరీ క్లబ్ గ్రేటర్ విశాఖ ఆధ్వర్యంలో మెగా బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్టు క్లబ్ ప్రెసిడెంట్ ఎం.డి.యాసిన్ బాబా తెలిపారు. శంకరమఠం రోడ్‌లో గల ఆఫీసులో క్లబ్ ప్రతినిధులతో కలిసి టోర్నమెంట్‌కు సంబంధించిన పోస్టర్లు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురుషులు, మహిళలకు సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. అనకాపల్లి నుంచి ఇచ్ఛాపురం వరకు 22 క్లబ్‌లకు చెందిన 48 టీమ్‌లు టోర్నమెంట్‌లో పాల్గొంటాయన్నారు. విశాఖ రైల్వే ఇండోర్ స్టేడియంలో నిర్వహించే టోర్నమెంట్‌లో సుమారు వెయ్యి మంది రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొంటారని తెలిపారు. క్లబ్ పాస్ట్ అసిస్టెంట్ గవర్నర్ బి.బ్రహ్మానందం మాట్లాడుతూ ఈ టోర్నమెంట్ ద్వారా సేకరించిన నిధులను రోటరీ ఇంటర్నేషనల్ క్లబ్ పోలియో నిధికి అందజేస్తామని తెలిపారు. క్లబ్ సెక్రటరీ చింతా నేతాజీ మాట్లాడుతూ ఆసక్తి కలిగిన క్లబ్ సభ్యులు పేర్లను ఈ నెల 28లోగా రిజిస్టర్ చేసుకోవాలని తెలిపారు. వివరాల కోసం టోర్నమెంట్ కమిటీ చైర్మన్ డాక్టర్ అశోక్ 98663 46347ను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో క్లబ్ వైస్ ప్రెసిడెంట్ బి.భాస్కరరావు, రోటరీ సభ్యులు కె.ఎం.కె.రమేష్, సూర్యతేజ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



ఎన్‌ఎంసీహెచ్ స్కూల్‌లో భోజనాలు పరిశీలిస్తున్న సీతమ్మధార మండలం ఎంఈవో - 2 బాలమణి

సీతమ్మధార : పీఅండ్‌టీ కాలనీలోని నెహ్రూ మున్సిపల్ పాఠశాలను సీతమ్మధార మండల ఎంఈవో – 2 బాలమణి మంగళవారం సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. ఎంత మంది విద్యార్థులు స్కూల్‌కు వస్తున్నారు..?, వారిలో ఎంత మంది భోజనం చేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. ప్రధానోపాధ్యాయుడు రాంప్రసాద్ ఆఫీస్‌లో ఉన్న రికార్డులను ఆమె పరిశీలించారు. విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ నగరంలో బుధవారం పర్యటించనున్నారని, ఎన్‌ఎంసీహెచ్ హైస్కూల్‌కి వచ్చే అవకాశం ఉందన్నారు. మరుగుదొడ్లు, స్కూల్ ఆవరణ, తరగతి గదులు శుభ్రంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్యాస్ లేక గుడ్లు లేవు..

గ్యాస్ సిలిండర్ అయిపోవడంతో విద్యార్థులకు మధ్యాహ్నం గుడ్లు ఇవ్వలేదు. దీంతో కొంత మంది గుడ్లు ఇవ్వలేదని వాపోయారు. ఈ విషయంపై హెచ్‌ఎం రాంప్రసాద్‌ను వివరణ కోరగా వంట గ్యాస్ సిలిండర్ అయిపోవడంతో గుడ్లు అందించలేకపోయామని తెలిపారు. ఈ స్కూల్‌లో సుమారు 1100 మంది విద్యార్థులు చదువుతున్నారు. వారందరికీ గుడ్లు అందించలేదు.

క్లుప్తంగా

రమణమ్మకు పాత్రికేయ పురస్కారం



కె.వి.ఎస్.రమణమ్మ

సీతంపేట : ముక్కామల నాగభూషణం పాత్రికేయ పురస్కారాన్ని నగరానికి చెందిన బాల బాట పిల్లల మాస పత్రిక సంపాదకురాలు కె.వి.స్వరాజ్యం వెంకట రమణమ్మ అందుకోనున్నారు. ఆమె ఈ పురస్కారానికి ఎంపికవడంతో పలువురు సాహితీవేత్తలు హర్షం వ్యక్తం చేశారు. కృష్ణా జిల్లా రచయితల 16వ మహా సభలు ఈ నెల 29న అవనిగడ్డలోని గాంధీ క్షేత్రంలో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా సాహిత్య రంగంలో విశేష సేవలందిస్తున్న పలువురికి పురస్కారాలు ప్రధానం చేస్తున్నారు.

సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు



సుబ్రహ్మణ్యస్వామికి క్షీరాభిషేకం చేస్తున్న ధర్మకర్త దేవాల రాజు

కంచరపాలెం : స్థానిక ఊర్వశి జంక్షన్ రవీంద్రనగర్‌లో గల సుబ్రహ్మణ్య స్వామి ఏకాంత ఆలయంలో శరవణ ట్రస్ట్ చైర్మన్, ఆలయ ధర్మకర్త దేవాల రాజు ఆధ్వర్యంలో మంగళవారం పూజలు నిర్వహించారు. సుబ్రహ్మణ్యస్వామికి భక్తులు స్వహస్తాలతో క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఆలయ అర్చకులు రామకృష్ణశర్మ అష్టోత్తర శత కలశాభిషేకం, విభూది, పుష్పాలతో అర్చనలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్నసమారాధన నిర్వహించారు.

గంజాయి కేసులో పాత ముద్దాయి అరెస్ట్

తాటిచెట్లపాలెం : గంజాయి కేసులో తప్పించుకు తిరుగుతున్న ముద్దాయిని విశాఖపట్నం రైల్వే పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గవర్నమెంట్ రైల్వే పోలీసు ఉన్నతాధికారుల సూచనలతో ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఎస్‌ఐ కె.అబ్దుల్ మారూఫ్ సిబ్బందితో కలిసి విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో పాత గంజాయి కేసులో ఏ3గా ఉన్న తూర్పు గోదావరి జిల్లాకు చెందిన రాయుడు యశ్వంత్ విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో గంజాయి రవాణా చేయడానికి రెక్కీ నిర్వహిస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

మద్యం మత్తులో గొడవ

మద్రిపాలెం : మద్యం మత్తులో ఇద్దరు స్నేహితుల మధ్య జరిగిన గొడవలో ఒకరికి గాయాలయ్యాయి. కంచరపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఐటీఐ జంక్షన్ వద్ద నివసిస్తున్న పి.ఉదయ్‌కుమార్, భరణి స్నేహితులు. వీరిద్దరూ ఈ నెల 22న సాయంత్రం బర్మా క్యాంప్ శ్మశాన వాటిక వద్ద మద్యం సేవించారు. ఈ క్రమంలో ఉదయ్ ప్రేమించిన యువతి కోసం భరణి తప్పుగా మాట్లాడడంతో గొడవ ప్రారంభమైంది. అలా మాట్లాడొద్దని ఉదయ్ సముదాయించినా భరణి ఆగకపోగా, తన వద్ద ఉన్న బీర్ బాటిల్‌ను విసిరాడు. తప్పించుకోవడానికి ప్రయత్నించినప్పటికీ ఉదయ్ భుజానికి గాయమైంది. దీంతో మంగళవారం సాయంత్రం బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

డీసీకి అభినందనలు



సుజాతను అభినందిస్తున్న అధికారులు

మహారాణిపేట: దేవదాయ శాఖ జోన్–1 ఇన్‌చార్జి ఉప కమిషనర్ (డీసీ)గా పని చేస్తున్న ఎన్.సుజాతకు ఉప కమిషనర్ (డీసీ, రెగ్యులర్)గా పదోన్నతి లభించింది. ఈ మేరకు పలువురు ఆమెను మంగళవారం అభినందించారు. శ్రీకాకుళం ఏసీ బలివాడ ప్రసాద్, పలు దేవాలయాల కార్యనిర్వహణాధికారులు శ్యామలరావు, సర్వేశ్వరరావు, శేఖర్‌బాబులు తదితరులు డీసీని సత్కరించారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



జీవీఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ



వినతిపత్రం అందిస్తున్న కార్పొరేటర్ గంకల కవిత

మద్రిపాలెం : జీవీఎంసీ 51వ వార్డులో పలు పనుల నిమిత్తం వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్‌ను మంగళవారం ఆయన చాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. మారియట్ హోటల్ నుంచి అల్లూరి సీతారామరాజు ఏరియా వరకు రోడ్డు విస్తరణలో భాగంగా అంబేడ్కర్ కాలనీ ప్రజలకు టీడీఆర్‌లు ఇవ్వనందున ఆ అర కిలోమీటర్ దూరంలో విస్తరణ పనులు ఆగిపోయాయని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో టీడీఆర్‌లు అందించే సమయానికి ఎన్నికల కోడ్ రావడంతో చెల్లించలేదని... త్వరగా టీడీఆర్‌లు అందజేసి త్వరితగతిన రోడ్డు పనులు పూర్తి చేయాలని కోరారు. అలాగే కళింగనగర్, వెలమ చెట్టు వీధి, ఉడా కాలనీ, మహత్ కాలనీ, చిట్టిబాబు కాలనీ ప్రాంతాల్లో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

కొండవాలు సమస్యలు పరిష్కరించండి

కంచరపాలెం : జీవీఎంసీ 48వ వార్డు కంచరపాలెం కొండవాలు ప్రాంతాల్లో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కార్పొరేటర్ గంకల కవిత జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్‌కు మంగళవారం వినతిపత్రం అందించారు. వార్డులో పర్యటించి సమస్యలు గుర్తించి, పెండింగ్ పనులు సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. వార్డు అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ వార్డు అధ్యక్షుడు గంకల అప్పారావు, నాయకులు పాల్గొన్నారు.

వైశాఖి స్పోర్ట్సు పార్కులో సుందరీకరణ పనులు



పార్కులో పనులు చేస్తున్న కార్మికులు

మురళీనగర్ : మురళీనగర్ వైశాఖి స్పోర్ట్సు పార్కు సుందరీకరణకు పాలకవర్గం చర్యలు తీసుకుంది. ఈ మేరకు గత వారం రోజులుగా పనులు చురుగ్గా సాగుతున్నాయి. ముఖ్యంగా స్విమ్మింగ్ పూల్ ఆధునికీకరణ పనులు ఇప్పటికే పూర్తవగా పరిసర ప్రాంతాల్లోని ఖాళీ స్థలంలో పచ్చని తివాచీ ఏర్పాటుకు పనులు నిర్వహిస్తున్నారు. గడ్డితో ల్యాన్ తయారీ, ఇతర పనులకు రూ.80 వేలు ఖర్చవుతోందని అంచనా వేశారు. ఇప్పటికే పాత మట్టి తొలగించి కొత్త మట్టితో నింపారు. ఇది పూర్తిగా భూమిలో కుదురుకున్న తర్వాత గడ్డి తివాచీ పనులు ప్రారంభమవుతాయని అధ్యక్షుడు సనపల వరప్రసాద్ చెప్పారు. ల్యాన్ చుట్టూ రంగురంగుల అందమైన క్రోటన్స్, ఆక్సిజన్ మొక్కలు పెంచుతారు. పూలమొక్కలు పెంచి ఆకర్షణీయంగా తయారు చేస్తారు. వైశాఖి స్పోర్ట్సు పార్కులోని గోపాల కృష్ణుడి విగ్రహానికి అనుబంధంగా ఉన్న స్థలంలో కొత్తగా మొక్కలు పెంచడంతోపాటు గడ్డితో పచ్చని తివాచీ ఏర్పాటు చేస్తారు. ఇందుకోసం రూ.30వేలు ఖర్చవుతుందని అంచనా వేశారు. దీనిలో భాగంగా విగ్రహాన్ని శుభ్రపరిచి, రంగులు వేయనున్నారు. పనులన్నీ పూర్తయితే పార్కు మరింత సుందరంగా కనువిందు చేయనుంది.

27న యూనియన్ బ్యాంకు ఉద్యోగుల సమ్మె



సీతమ్మధార యూనియన్ బ్యాంకు ప్రాంతీయ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఉద్యోగులు

సీతమ్మధార : సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 27న యూనియన్ బ్యాంకు ఉద్యోగులు, అధికారుల సంఘం చేపట్టిన సమ్మెను విజయవంతం చేయాలని సంఘం నాయకులు సీతమ్మధారలోని బ్యాంకు ప్రాంతీయ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ యూనియన్ బ్యాంకు ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఉదయ కుమార్ మాట్లాడుతూ బ్యాంకుల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, ఉద్యోగులపై పని ఒత్తిడి తగ్గించాలని, అప్రెంటిస్ నియామకాలు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అధికారుల సంఘం నాయకుడు కె.రమేష్ మాట్లాడుతూ రాత్రి ఏడు గంటలు దాటినా ఇంటికి వెళ్లలేకపోయిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రీజినల్ కార్యదర్శి వసంతరావు, సాగర్, శ్రీనివాస్, ప్రత్యూష, తదితరులు పాల్గొన్నారు.

రహదారి మధ్యలో గొయ్యి



రహదారి మధ్యలో ఏర్పడిన గొయ్యి పైనుంచి ప్రవహిస్తున్న మురుగునీరు

మురళీనగర్ : మురళీనగర్ బిర్లా కూడలి నుంచి వర్మ కాంప్లెక్స్‌కు వెళ్లే రహదారిలో ప్రమాదం పొంచి ఉంది. దిగువ నుంచి ఎత్తైన ప్రదేశానికి నిర్మించిన ఈ మార్గం మధ్యలో భారీ గొయ్యి ఏర్పడింది. వర్మ కాంప్లెక్స్‌కు వెళ్లే ప్రయాణికులు, వాహన చోదకులు ఏమాత్రం అజాగ్రత్త వహించినా ప్రమాదం జరిగే అవకాశం ఉంది. చీకట్లో ఎగువకు వెళ్లేటప్పుడు దగ్గరికెళ్లే వరకు గొయ్యి కనిపించడం లేదు. రహదారిపై పెచ్చులు ఊడిన మచ్చ మాదిరిగా కనిపిస్తోంది. ఎగువ నుంచి అపార్టుమెంట్ల నుంచి వచ్చే నీరు ఇటువైపు రహదారిపై గొయ్యి మీదుగా ప్రవహిస్తోంది. దీంతో మరింత ప్రమాదకరంగా తయారయ్యింది. అధికారులు, జీవీఎంసీ సిబ్బంది ఇటువైపే ప్రయాణిస్తున్నా గొయ్యిని పూడ్చేందుకు చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డుపై పేరుకుపోయిన వ్యర్థాలు



పీ అండ్ టీ కాలనీలో రోడ్డుపై పేరుకుపోయిన చెత్త

చెత్తమయంగా సీతమ్మధార వీధులు

సీతమ్మధార : జీవీఎంసీ 24వ వార్డు పరిధి సీతమ్మధారలో వీధులన్నీ కంపుకొడుతున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెత్తకుప్పలు పేరుకుపోయి దుర్వాసన రావడంతో భరించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా పీ అండ్ టీ కాలనీలో రోడ్లపై చెత్త పేరుకుపోయింది. ఇక్కడికి సమీపంలోనే జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల ఉంది. నిత్యం వందలాది మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు రాకపోకలు సాగించే సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై చెత్త పేరుకుపోతున్నా పారిశుధ్య సిబ్బంది పట్టించుకోవడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్, సూపర్‌వైజర్ల జాడే కనిపించడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికే సీజనల్ వ్యాధులతో బాధపడుతుండగా, మరోవైపు పారిశుధ్య సిబ్బంది నిర్లక్ష్యం పుణ్యమా అని వీధుల్లో చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయని వాపోతున్నారు. స్వచ్ఛభారత్ అంటూ జీవీఎంసీ ప్రజారోగ్యశాఖ అధికారులు ఆర్భాటంగా చేస్తున్న ప్రకటనలకు సీతమ్మధారలో పరిస్థితికి పొంతన కుదరడం లేదని స్థానికులు గగ్గోలు పెడుతున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ జోన్ – 3 ప్రజారోగ్య విభాగం అధికారులు స్పందించి పారిశుధ్యం మెరుగుపరిచేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కుట్రపూరిత చర్యలు విడనాడాలి

సీతమ్మధార: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సాగిస్తున్న కుట్రపూరిత చర్యలను విడనాడాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జీవీఎంసీ గాంధీ పార్కులో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో జరుగుతున్న దీక్షలు 1277వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కుట్రపూరిత చర్యలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే రూ. 11 వేల కోట్లు వర్కింగ్ క్యాపిటల్‌గా కేటాయించాలన్నారు. స్వచ్ఛంద పదవీ విరమణ పథకాన్ని నిలిపేయాలని, ఇతర స్టీల్‌ప్లాంట్లకు కార్మికులను బదిలీ చేసే చర్యలను ఆపేయాలని కోరారు. కూటమి నాయకులు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలన్నారు. గంగవరం పోర్టును ప్రభుత్వం వెంటనే స్వాధీనం చేసుకోవాలన్నారు. డిమాండ్లపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోకపోతే రాబోయే కాలంలో సమరశీల ఉద్యమాల్ని ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రొఫెసర్ సూరప్పుడు, వై.కొండయ్య, కె.మల్లయ్య, తిరుపతిరావు పాల్గొన్నారు.

భారీ ట్రాలీతో ఇబ్బందులు



గురుద్వారా జంక్షన్ వద్ద భారీ ట్రాలీ

సీతమ్మధార : భారీ ట్రాలీతో వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. అక్కయ్యపాలెం హైవే నుంచి మద్దిలపాలెం వైపు వెళ్తున్న భారీ ట్రాలీ ప్రమాదకరంగా మారింది. ట్రాలీలో వెనుక నుంచి వచ్చిన వాహనచోదకులు ఇబ్బందులకు గురయ్యారు. ట్రాలీ ఖాళీగా ఉండటంతో స్పీడ్‌గా వెళ్లడంతో వెనుక నుంచి వచ్చిన వాహనదారులకు కష్టతరంగా మారింది.

ముందస్తు జాగ్రత్తలతోనే వ్యాధుల కట్టడి



కేఆర్‌ఎం కాలనీలో పర్యటిస్తున్న జిల్లా మలేరియా అధికారి తులసీరాజ్

మద్దిలపాలెం: డెంగ్యూ, మలేరియా జ్వరాల నుంచి రక్షణకు ముందస్తు జాగ్రత్తే శ్రీరామరక్ష అని జిల్లా మలేరియా అధికారి తులసీరాజ్ అన్నారు. జీవీఎంసీ 16వ వార్డు కేఆర్‌ఎంకాలనీలో నమోదైన డెంగ్యూ పాజిటివ్ కేసు సోకిన వ్యక్తి ఇంటిని ఆమె మంగళవారం సందర్శించారు. డెంగ్యూ సోకడానికి గల కారణాలు ఆరా తీశారు. ఇంటి పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి శుక్ర, మంగళవారాలు డ్రైడే పాటించాలని, ఆరోజు ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలను తొలగించుకోవాలని సూచించారు. ఇంటి వద్దకు వచ్చే యాంటీ మలేరియా బృందాలకు సహకరించాలన్నారు. వారి సూచనలు పాటించాలన్నారు. అనంతరం ఏఎన్‌ఎం, ఆశ, ఏఎల్‌వో సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి పరిసరాల్లో నీటి నిల్వలను గుర్తించి తొలగించాలన్నారు. ఇంట్లో ఫ్రిడ్జిలు, ఏసీల ద్వారా వచ్చే నీటిని ఎప్పటికప్పుడు పరిశీలించాలని పేర్కొన్నారు. వారం పైబడి ఉండే నీటి నిల్వలు దోమలకు ఆవాసాలుగా మారతాయని తెలిపారు. దోమ కాటు ద్వారా మలేరియా, డెంగ్యూ జ్వరాలు వ్యాప్తి చెందుతాయనే విషయాన్ని ప్రజలకు తెలియజేయాలని సిబ్బందికి తెలిపారు. వైద్యాధికారి డాక్టర్ రెహినిషా, మలేరియా సబ్ యూనిట్ అధికారులు నగేష్ పట్నాయక్, శేషుబాబు, జీవీఎంసీ యాంటీ మలేరియా బృందం సభ్యులు పాల్గొన్నారు.

ఐక్య ఉద్యమాలతో ఉక్కు పరిరక్షణ



దీక్షా శిబిరంలో పాల్గొన్న కార్మికులు

అగనంపూడి: ఐక్య ఉద్యమాలతో విశాఖ ఉక్కును కాపాడుకుంటామని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ అన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో చేపట్టిన 1321వ రోజు రిలే దీక్షా శిబిరంలో ఆయన మాట్లాడారు. భవిష్యత్‌లో కార్మిక సంఘాలను ఐక్యం చేసి వారి సహకారంతో విశాఖ ఉక్కు పరిరక్షణ ఉద్యమాలను ఉధృతం చేస్తామన్నారు. స్టీల్‌ప్లాంట్ సంక్షోభానికి కేంద్రప్రభుత్వం వైఖరి కారణమన్నారు. కొంతమంది ఉన్నతాధికారులు విశాఖ ఉక్కు కర్మాగారంపై కక్ష కట్టి నాశనం చేశారన్నారు. కేంద్ర పాలకులు, యాజమాన్య వైఖరి వల్ల వేలాది మంది కార్మికులు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందన్నారు. శిబిరంలో కిడిమి రాజబాబు, జె.నరేష్ కుమార్, చీకటి శ్రీనివాసరావు, జగదీష్, కరణం పైడిరాజు, వరప్రసాద్, సతీష్, ఇందల శివకుమార్ పాల్గొన్నారు.